ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 33.0 | కనిష్ఠం : 19.0

ANDHRAJYOTHY

5



ఆంగ్లంపై పట్టు.. సులభంగా కలిగేట్టు

- డిజిటల్ పద్ధతిలో ఇంగ్లిష్ నేర్పించేందుకు చర్యలు
- విద్యార్థులకు భాషపై ఆసక్తి పెంచడమే ప్రధాన లక్ష్యం
- ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతి గది
- సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు సంతోష్

7

రద్దు చేయరా?

- మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న అక్రమ డిప్యుటేషన్లు
- నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న 20 మంది ఉపాధ్యాయులు
- అందుకోసం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు
- తమకు బదులుగా మరొకరితో బోధన చేయిస్తున్న కొందరు టీచర్లు
- రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు, విద్యా సంస్థల నిర్వహణ, చీటీలు, వడ్డీల దందాల్లో బిజీబిజీ



మహబూబ్‌నగర్‌లోని డీఈవో కార్యాలయం



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయడంలో విద్యాశాఖ వెనుకంజ వేస్తోంది. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా మహబూబ్‌నగర్‌లో మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు కోరుకున్న చోటుకు డిప్యుటేషన్ ఇచ్చారు. అందుకు అప్పట్లో రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు చేతులు మారాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరికొందరు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫారసులతో ఇతర మండలాల్లోనూ డిప్యుటేషన్ పొందారు. అక్రమ డిప్యుటేషన్ల గురించి తెలిసినా జిల్లా విద్యాశాఖ అధికారి మాత్రం వాటిని రద్దు చేయడంలో జంకుతున్నారు.

మామూళ్ల మత్తులో..

మరికొందరు ఉపాధ్యాయులు డీఎడ్, డైట్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నారని సమాచారం. దీనిపై అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేస్తున్నామని, మండల విద్యాశాఖ అధికారులకు వారం కిందట జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ చెప్పినా ఇప్పటికి ఏ ఒక్కరూ అక్రమ డిప్యుటేషన్ నుంచి సొంత మండలాలకు వెళ్లలేదు. ఈ విషయమై మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈవో లక్ష్మణ్‌సింగ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. తమకు డీఈవో నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదని, వస్తే అమలు చేస్తామని చెప్పారు.

మరొకరితో బోధన.. దందాల్లో బిజీ

జిల్లా వ్యాప్తంగా సుమారు 20 మంది అక్రమ డిప్యుటేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. మరికొందరు ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా వారి స్థానంలో మరొకరితో బోధన చేయిస్తూ, రియల్ ఎస్టేట్, విద్యా సంస్థలు, వడ్డీకి డబ్బులు ఇవ్వడం, చిట్టీల దందా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా మండల విద్యాశాఖ అధికారులకు తెలిసినా వారికి ముడుపులు అందుతుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

ఆరోపణలు ఎదుర్కొన్న టీచర్ జీసీడీవోగా కొనసాగింపు

కేజీబీవీల పర్యవేక్షణకు సమగ్ర శిక్ష అభియాన్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని జీసీడీవోగా తీసుకోవాలి. జిల్లాలో రెండేళ్ల కిందట ఓ ఉపాధ్యాయురాలు ఈ పరీక్షలో పాస్ అయ్యింది. ఆమెనే జీసీడీవోగా కొనసాగాల్సి ఉంది. కానీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు సదరు ఉపాధ్యాయురాలిపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి, ఆమె విధుల్లో చేరకుండా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆమె రెండేళ్లుగా డీఈవో, హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం చుట్టు తిరిగినా జీసీడీవో పోస్టింగ్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఓ పాఠశాలలో పని చేస్తున్న, పలు ఆరోపణలు ఉన్న ఉపాధ్యాయురాలిని జిల్లా విద్యాశాఖ అధికారి డిప్యుటేషన్‌పై జీసీడీవోగా నియమించారు. అది అక్రమ డిప్యుటేషన్ అని విద్యార్థి సంఘాలు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు వచ్చాయి. దాంతో ఆమె డిప్యుటేషన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, ఉత్తర్వు కూడా ఇచ్చామని డీఈవో తెలిపారు. కానీ సదరు ఉపాధ్యాయురాలు 30 రోజులుగా విధుల్లో కొనసాగుతున్నారు. ఇంత జరిగినా విద్యాశాఖ పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏంటో తెలియడం లేదని పలువురు కేజీబీవీ ఎస్‌వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ డిప్యుటేషన్‌పై వచ్చిన జీసీడీవో కేజీబీవీలను తనిఖీ చేస్తున్న సమయంలో ఎస్‌వోలను బెదిరిస్తున్నట్లు ఒక ఎస్‌వో చెప్పడం గమనార్హం. మీవి కాంట్రాక్టు ఉద్యోగాలని, మీకు ఏమీ రాదని కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి, డిప్యుటేషన్‌పై ఉన్న జీసీడీవోను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏసీబీ దాడులతో.. ఉలిక్కి పడిన గద్వాల

- జిల్లాలో కోరలుచాచిన అధికారుల అవినీతి
- ప్రతీ పనికి ఓ ధర.. లేదంటే ఫైల్ పక్కకి

గద్వాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాలు తీరుస్తూ, ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. జిల్లాలో ప్రజలకు సంబంధించి ఏ పని చేయాలన్నా కార్యాలయాల్లో లంచం ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయంటే ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే కొందరు ఉద్యోగుల అవినీతిని అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది రెవెన్యూ అధికారిగా వచ్చిన వ్యక్తి ఇనాం భూములు, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి ఓఆర్‌సీల జారీకి లక్షల్లో లంచం తీసుకున్నాడు. ఆయన పనిచేసిన ఆరు నెలల కాలంలోనే దాదాపు రూ.3కోట్లకు పైగా సంపాదించుకున్నాడనే ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు బదిలీ చేశారు. రూ.60 వేలు పెట్టు ఎంతైనా కొట్టు అంటూ ఓ పోలీస్ అధికారిపై సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టింది. ఈ వార్తపై అంతర్గతంగా ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. మధ్యవర్తులను పెట్టుకొని లీగల్‌హేర్లను కూడా మార్చి వేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన అవినీతి పెరిగిపోవడంతో ఒకటి రెండు రోజుల్లో ఏసీబీకి పట్టుబడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుండగానే డీపీవో పట్టుబడటం సంచలనంగా మారింది. గత ఆర్టీవో చెక్‌పోస్టులో 15రోజుల ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ఇది సాధారణ తనిఖీ కావడంతో అధికారులు లైట్‌గా తీసుకున్నారు.

గడగడలాడిన కలెక్టరేట్

జోగుళాంబ గద్వాల జిల్లా పంచాయతీ అధికారి శ్యామ్‌సుందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌రెడ్డిలు డీపీవో ఇచ్చిన నోటీసును వెనక్కి తీసుకోవడానికి ఓ వెంచర్‌దారుడిని రూ.3లక్షలు డిమాండ్ చేసి రూ.2లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. శుక్రవారం ఆలంపూర్ చౌరస్తా నుంచి ఆలంపూర్‌కు వెళ్లే దారిలో రూ.2లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. విచారణ నిర్వహించగా డీపీవో శ్యామ్‌సుందర్ ఆదేశం మేరకే తీసుకున్నట్లు చెప్పడంతో కలెక్టరేట్‌లోని డీపీవో చాంబర్‌కు ఏసీబీ అధికారులు చేరుకొని శ్యామ్‌సుందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత తనిఖీలు చేశారు. సిబ్బందిని విచారించారు. ఈ విషయం కలెక్టరేట్‌లోని అధికారులకు తెలియడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అవినీతి అధికారులు

(మిగతా 6లో..)

అట్టహాసంగా మహా నగరోత్సవం

- మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మొదలైన వేడుకలు
- కిటకిటలాడిన స్టాళ్లు.. అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

6

- హాజరైన ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేందిర బోయి



వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి

చికెన్ సేల్స్ ఢమాల్

- వారంలో సగానికి తగ్గిన విక్రయాలు
- బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో తగ్గిన కొనుగోలు



మహబూబ్‌నగర్‌లో విక్రయాలు లేక వెలవెలబోతున్న ఓ చికెన్ దుకాణం



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో పాటు సరిహద్దు జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో మహబూబ్‌నగర్ జిల్లాలో చికెన్ సేల్స్ పడిపోయాయి. జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ వైరస్ ఆనవాళ్లు లేకున్నా ఇతర జిల్లాల్లో వైరస్ వ్యాప్తి కారణంగా చికెన్ తినడం తగ్గిం చేశారు. ఎక్కువగా ఉడికించిన చికెన్ తింటే ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని అధికారులు చెబుతున్నా.. ప్రస్తుత సీజన్‌లో తినకపోవడమే మంచిదని చాలామంది భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో హోల్‌సేల్ చికెన్ వ్యాపారి రోజూ 100 నుంచి 120 కిలోల చికెన్ విక్రయించేవారు. వారం రోజులుగా ప్రజలు చికెన్ కొనుగోళ్లను తగ్గించడంతో ఏకంగా సగానికి పైగా విక్రయాలు తగ్గాయి. ఎప్పుడూ బిజీగా ఉండే సదరు వ్యాపారి దుకాణానికి గిరాకీ లేకపోవడంతో ఆయన టూర్‌కు వెళ్లారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య విద్యార్థులు, స్టాఫ్ కోసం రోజూ వంద కిలోల చికెన్ వండుతారు. ఆ ఆస్పత్రిలో చికెన్ వంటకాలను వారం రోజులుగా నిలిపేశారు. చికెన్ స్థానంలో మటన్ వడిస్తున్నారు.

కిలో ధర రూ.200

విక్రయాలు పడిపోయినా చికెన్ ధర మాత్రం చాలామంది తగ్గించకుండానే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కిలో ధర రూ.200గా ఉంది. కొంతమంది మాత్రం డిస్కౌంట్ అంటూ రూ.60-170 వరకు విక్రయిస్తున్నారు. అకస్మాత్తుగా విక్రయాలు తగ్గిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉండనుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. దుకాణాల అద్దె, కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతాలకు ఇబ్బంది అవుతుందని వాపోతున్నారు. గుడ్ల విక్రయాలు కూడా 40 నుంచి 50 శాతం మేర పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. గుడ్డు ధర ఇదివరకు రూ.5 నుంచి రూ.6 వరకు ఉండగా ప్రస్తుతం రూ.4 నుంచి రూ.5 వరకు ఉంది. కాగా జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. అన్ని ఫౌల్ట్రీలపై దృష్టి పెట్టామని, జిల్లాలో ఇప్పటివరకు వైరస్ ఆనవాళ్లు లేవని తెలిపారు.

యజమానులకు నష్టం కలుగొద్దు

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి14,(ఆంధ్రజ్యోతి): రోడ్డు వెడల్పు పనులలో గృహాల యజమానులకు నష్టం కలగకుండా చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో కోస్గి రోడ్డు వెడల్పు పనులపై తహసీల్దార్, మునిసిపల్ అధికారులు, ఇళ్ల, వ్యాపార సముదాయాలు కోల్పోయే వారితో జిల్లా స్థాయి నెగోషియేషన్ సమావేశం నిర్వహించారు. 40 మంది హాజరయ్యారు. స్క్వేయర్‌యార్డ్‌కు రెసిడెన్షియల్ ప్లాట్స్‌కు రూ.4,200, కమర్షియల్ షాప్‌లకు రూ.11,600 నష్ట పరిహారం ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 188 మందికిగాను 165 మంది ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం తీసుకునేందుకు సమ్మతించారని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలం, ఆర్డీవో రాంచందర్, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, నాగరాజు, కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

222

- నారాయణపేట జిల్లాలో బడి బయటి పిల్లల సంఖ్య ఇది
- గత నెలలో నిర్వహించిన ఓఎస్‌డీ సర్వేలో గుర్తింపు
- 6-14 ఏళ్లలోపు వారు 124 మంది
- 15-19 ఏళ్లలోపు వారు 98 మంది
- వచ్చే ఏడాది విద్యా సంస్థల్లో చేరిక



నారాయణపేట మండలం లింగంపల్లిలో బడి బయటి పిల్లలను గుర్తించిన సీఆర్‌పీ రవిప్రకాష్(ఫైల్)

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చదువుకునే వయస్సులో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల బడికి వెళ్లని వారిని నారాయణపేట జిల్లాలో 222 మంది విద్యార్థులను అధికారులు గుర్తించారు. ఓఎస్‌డీ(ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్) సర్వేలో భాగంగా వారిని గుర్తించారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద్ రాజ్, జిల్లా మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో 29 మంది సీఆర్‌పీలు ఈ సర్వే చేపట్టారు. వీరిలో కొందరు ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుండగా, మరికొందరు కుల వృత్తుల్లో కొనసాగుతున్నారు. ఇంకొందరు దుకాణాలు, హోటళ్లు, బేకరీలు తదితర పనులు చేస్తున్నారు. పలువురు చిత్తు కాగితాలు ఏరుతున్నారు. తద్వారా బాలకార్మికులుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. బడి బయటి పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించేందుకు విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏటా రెండు సార్లు సర్వే స్తున్నారు.

జిల్లాలో పిల్లల గుర్తింపు

గత జనవరి 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. మొత్తం 222 మందిని గుర్తించగా, 6-14 ఏళ్లలోపు వారు 124 మంది, 15-19 ఏళ్లలోపు కళాశాల స్థాయి వారు 98 మందిని గుర్తించారు. గుర్తించిన వారిలో విద్యార్థుల సామర్థ్యం, వయస్సు ప్రకారం ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించనున్నారు. అర్హత ఉన్న వారికి దూర విద్యలో ప్రవేశం కల్పించనున్నారు. సీఆర్‌పీలు వివరాలను ప్రబంధ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. పిల్లలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించనున్నారు.



సోమశిల గ్రామంలో ఆదివాసీ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కొప్పుల రాజు

నాయకత్వ బలోపేతమే లక్ష్యం

- జాతీయ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు వెల్లడి

7

- ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ పుట్టింది : ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

మన్యంకొండ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు 7

లారీ, ద్విచక్ర వాహనం ఢీ

మహిళ మృతి, ఒకరికి తీవ్ర గాయాలు 7

పోలీస్ స్టేషన్ ముందు సుభానీ బాధితుల ధర్నా

- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.100 కోట్ల వరకు మోసం
- ఎమ్మెల్యే హామీతో విరమణ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నాలుగేళ్ల క్రితం మోసం చేసి, ఉడాయించిన షేక్ మహబూబ్ సుభానీ నుంచి తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని మక్తల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు శుక్రవారం ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడికి వచ్చి, బాధితులతో మాట్లాడారు. పోలీసు అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. షేక్ సుభానీని నెల్లూరు జిల్లా కావలిలో అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వివరించారు. ఇక్కడ జరిగిన ఆర్థిక మోసంపై ఉన్నతాధికారుల సాయంతో ఏపీ ప్రభుత్వానికి చేరవేస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో సుమారు రూ.100 కోట్ల వరకు కాజేసినట్లు బాధితులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే హామీ మేరకు బాధితులు ధర్నా విరమించారు.

ఆనాడే పట్టుకొని ఉంటే..

షేర్‌మార్కెట్ పేరుతో నాలుగేళ్ల క్రితం మక్తల్ ప్రాంతంలో కోట్ల రూపాయలు కొల్లగొట్టి ఉడాయించిన మొహ్మద్ షేక్ సుభానీని ఆనాడే పట్టుకొని ఉంటే నెల్లూరు జిల్లాలో మోసం జరిగి ఉండేది కాదని ఈ ప్రాంత బాధితులు అంటున్నారు. ఇప్పటికైనా మోసగాడి నుంచి తమ డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 2019 నుంచి 2021 వరకు మక్తల్ పట్టణంలో షేర్ మార్కెట్ పేరుతో ఈ ప్రాంత ప్రజలను నిలువునా మోసం చేసి, ఇక్కడి నుంచి ఉడాయించాడు. అప్పట్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆందోళనలు సైతం చేశారు. నాలుగేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలో ఇదే తరహాలో మోసం చేసి ఉడాయించేందుకు ప్రయత్నించగా, అక్కడి పోలీసులు మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు.



స్టాళ్లను తిలకిస్తున్న సందర్శకులు





చేతిపై పెయింట్ వేయించుకుంటున్న కలెక్టర్, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

అట్టహాసంగా మహానగరోత్సవం

● మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మొదలైన వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పాలమూరు నగరపాలికలో రెండ్రోజులపాటు నిర్వహించతలపెట్టిన మహబూబ్‌నగర్ మహానగరోత్సవ కార్యక్రమాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌గా రూపుదిద్దుకున్న సందర్భంగా శిల్పారామంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి నగరోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మినీ శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో భాగంగా వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారుల వ్యాపార సామగ్రి, మహిళా ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, హ్యాండ్‌క్రాఫ్ట్ వస్తువులు, శ్రీరామ, బజాజ్ షోరూమ్ వాహనాలు, సోలార్, ఏసీ, కూలర్‌లతో పాటు మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు, ఫుడ్ కోర్టులను స్టాళ్లలో ఏర్పాటు చేశారు. దాంతో ఉదయం నుంచే శిల్పారామం వద్ద సందడి నెలకొంది. పట్టణవాసులు స్టాళ్లను తిలకిస్తూ కొనుగోలు చేశారు. సాయంత్రం నుంచి స్టాళ్లన్నీ కిటకిటలాడాయి. పాఠశాలల వదిలిన అనంతరం సాయంత్రం ఆరు గంటల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శిల్పారామం కిక్కిరిసింది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నగరోత్సవంలో వివిధ పాఠశాలల చిన్నారుల వేషాధారణలు, విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులంతా సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. పట్టణ ప్రజలు నృత్యాలను ఆసక్తిగా తిలకించారు. మెజీషియన్ నరేశ్ తన మ్యాజిక్‌తో ఆకట్టుకున్నారురు. 360 డిగ్రీ కెమెరా కూడా అందరినీ ఆకట్టుకుంది. ఆ కెమెరాపై నిలుచునేందుకు జనం పోటీపడ్డారు.

మహబూబ్‌నగర్‌ను క్లీన్, గ్రీన్ సిటీగా మార్చుకుందాం: ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ నగరాన్ని భవిష్యత్తులో హైదరాబాద్‌కు ధీటుగా నిలపాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నగరాన్ని క్లీన్, గ్రీన్ సిటీగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటి నుంచో మునిసిపాలిటీగా ఉన్న పట్టణాన్ని కార్పొరేషన్‌గా మార్చుకున్నామని, ఈ విషయం అందరికీ తెలువాలన్న ఉద్దేశంతోనే రెండ్రోజులపాటు మహానగరోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో వసతులు పెంచుకోవాల్సిన అవసరం ఉందని, రోడ్లు, డ్రైనేజీలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. మన నగరం మన బాధ్యత అని, పెరుగుతున్న హోదాతోపాటు బాధ్యత కూడా పెరగాలని చెప్పారు. ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఇంటి ముందు మొక్కలు పెంచుకుని, సంరక్షించుకోవాలన్నారు. చెత్తను వీధుల్లోకి పారవేయొద్దన్నారు. ఇవన్నీ పాటిస్తేనే నెంబర్‌వన్ సిటీగా పాలమూరుకు పేరు వస్తుందన్నారు. చిన్నారులలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కూడా ఈ నగరోత్సవాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్పొరేషన్‌గా మార్చిన ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నగరోత్సవాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని, అవసరమనుకుంటే కలెక్టర్ మరో రోజు పొడగిస్తారని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే, కలెక్టర్ స్వచ్ఛ ఆటోలను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి నాయకులు సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.

చేతికి బటర్‌ఫ్లై పెయింట్ వేయించుకున్న కలెక్టర్

కలెక్టర్ విజయయేందిర బోయి చేతికి బటర్‌ఫ్లై పెయింట్ వేయించుకున్నారు. నగరోత్సవంలో భాగంగా టాటూ, పెయింటింగ్ వేస్తుండటంతో కలెక్టర్ తన చేతికి బటర్‌ఫ్లై డిజైన్ పెయింటింగ్ వేసుకుని, ఉత్సాహ పరిచారు.

జనాభా తక్కువ చూపడం సరికాదు

● మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



మాట్లాడుతున్న కొండ దేవయ్య

పాలమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో మున్నూరు కాపు జనాభాను తక్కువ చూపటం సరికాదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండదేవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. 2014లో సమగ్ర కుటుంబ సర్వే చేసినప్పుడు 28 లక్షలు ఉంటే, 2024లో కులగణనలో కేవలం 13 లక్షలు మాత్రమే చూపారు. ఎందుకు మున్నూరు కాపుల జనాభా తగ్గుతోందని ప్రశ్నించారు. మున్నూరు కాపులను రాజ్యాధికారానికి దూరం చేద్దామనుకునే కుట్రలో భాగం అన్నారు. కులగణన 50 రోజులు జరిపి తక్కువ జనాభాను చూపడం ఏంటన్నా రు. బీసీలు రెండు కోట్ల 20 లక్షలు, మొత్తం జనాభా 4 కోట్ల 20 లక్షల మంది ఉన్నారు. అసెంబ్లీలో మున్నూరు కాపులను కాలు పెట్టనీయరాదని అణగదొక్కాలనే ప్రయత్నమే అన్నారు. ఫైనాన్స్ కార్పొరేషన్ గురించి మేము కోరితే నేటికీ ఇవ్వలేదన్నారు. కరోనా సమయంలో మా వాళ్లు మరణించారా... ఇతర దేశాలకు వలసవెళ్లారా..? అని ప్రశ్నించారు. మరోసారి అన్ని కులాలు ఎన్ని ఉన్నాయనే దానిపై స్పష్టత కోసం కులగణన చేసి వాస్తవ జనాభాను చూపించి రిజర్వేషన్ క ల్పించాలన్నారు. తొందరలోనే హైదరాబాద్‌లో మున్నూరు కాపులతో పది లక్షల మందితో సభ పెట్టి మా బలం చూపిస్తామన్నారు. ఆదివారం రచ్చబండ పేరుతో చేపట్టనున్న కార్యక్రమంలో మున్నూరు కాపులు పాల్గొని ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కోరమోని వెంకటయ్య, పెద్ద వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, జి.వేణుగోపాల్, రమేష్, నరేందర్, నర్సిరెడ్డి, కిరణ్‌కుమార్, గోపి, శేఖర్, కృష్ణయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు

● హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్



రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చట్టబద్దమైన హక్కులు లేకపోవటంతో హమాలీలు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సి.వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నాల్గవ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. తెలంగాణలో మూడు లక్షల మంది వివిధ రంగాల్లో హామాలి, మిల్ కార్మికులు ఎగుమతి, దిగుమతులు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ మార్కెట్, సివిల్‌సప్లై (ఎఫ్‌సీఐ) గ్రానైట్, మార్బుల్, ప్రభుత్వ, ప్రైవేట్ గోదాముల్లో మార్కెట్, రైల్వే, ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్టు, బజార్, హమాలీ, జట్టుముఠా, కళాసి, దడవాయి పేరుతో వీరిని పిలుస్తారని వివరించారు. ఫిబ్రవరి 21న ఖమ్మంలో జరిగే హమాలీ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పనిభద్రత హక్కులు లేకపోవటంతో దయనీయమైన స్థితిలో కార్మికులు జీవిస్తున్నారన్నారు. నాయకులు నరసింహ, దాసు, సతీష్, శ్రీను, కృష్ణయ్య, నారాయణ, సాయిలు, చెన్నయ్య, రాములు పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో

అక్షర ప్రభంజనం



విద్యార్థికి శుభాకాంక్షలు తెలుపుతున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ (విద్యావిభాగం) ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మొదటి సెషన్ జెఈఈ మేయిన్స్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల ఐఐటీ నీట్ అకాడమి ప్రభంజనం సృష్టించింది. అకాడమికి చెందిన పి.చరణ్ తేజ (నం.250310053604) మొదటి సెషన్ జెఈఈ మేయిన్స్ ఫలితాల్లో 98.78 శాతం సాధించారు. అతనితో పాటు కళాశాలకు చెందిన శృతిశ్రీ, హర్షవర్ధన్, అఖిల్‌గౌడ్, అనుదీప్‌లు కూడా ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ కళాశాల డైరెక్టర్ విజయ్‌కుమార్ విద్యార్థికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ మాట్లాడారు. గతంలో నీట్, ఐపీఈలో కూడా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. తమ కళాశాలలో చదివే ప్రతీ సాధారణ విద్యార్థి కూడా జెఈఈ, మేయిన్స్ ప్రవేశపరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేవిధంగా నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జియావుద్దీన్, హరికృష్ణ, విష్ణువర్ధన్, యాకూబ్, జైపాల్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆస్తికోసమే హత్య

- అన్నను చంపిన తమ్ముడు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆస్తివిషయంలో సొంత అన్ననే హత్య చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలోని శాంతినగర్‌లో చోటుకున్నది. ఈ కేసును జిల్లా పోలీసులు కేవలం 48 గంటలవ్యవధిలోనే ఛేదించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. శాంతినగర్ మండలం తనగల గ్రామానికి చెందిన సంధ్యపోగు రమేష్ (38) శాంతినగర్‌లోని మద్దూరు స్టేజీ సమీపంలో రెండు రోజుల క్రితం (ఫిబ్రవరి 12, 2025) గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. గతంలో భాగపరిష్కారం విషయంలో అన్నదమ్ములకు గొడవలు ఉన్నాయని, తన భర్త మరణంపై అనుమానాలు ఉన్నాయని సంధ్యపోగు చంద్రకళ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శాంతినగర్ సీఐ టాటా బాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక, నైపుణ్యం ఆధారంగా డీఎస్పీ మొగిలయ్య పర్యవేక్షణలో జల్లాపూర్ చెక్‌పోస్ట్‌వద్ద నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశారు. వారినుంచి ఒక కారు, మూడు వేటకొడవళ్లు, నాలుగు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

గోపి, మహేష్‌లు ఆస్తివిషయంలో మృతుడు రమేష్, మరో సోదరుడు తిమ్మప్పలతో గొడవ పడుతుండేవారు. గత ఏడాదిలో మహేష్ మోటర్ సైకిల్‌పై వస్తుండగా సంధ్యపోగు రమేష్, మరో అన్న తిమ్మప్పలు మహేష్‌పై హత్యాయత్నం చేశారు. అప్పట్లో కేసులు కూడా నమోదు చేశారు. ఎలాగైన అన్న రమేష్‌ను హత్య చేయాలని మహేష్ నిర్ణయించుకున్నాడు. తల్లిదండ్రులతో పాటు మరో అన్న గోపి, బోయ నర్సింహులుకు విషయం చెప్పాడు. తన అన్న రమేష్‌ను చంపితే రూ. 1.50 లక్షల బొలేరో వాహనం ఇస్తానని డీల్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందుకు మరో ఇద్దరు బండమీది తిమ్మప్ప, బోయ నాగేంద్ర సహాయం తీసుకొని వేట కొడవళ్లు చేయించి రమేష్‌ను చంపాలనుకున్నారు. అందులో భాగంగా వారం రోజుల కిందట రమేష్‌ను వెంకటాపురం స్టేజీ సమీపంలో బొలోరోతో ఢీకొట్టి చంపుదామనుకున్నారు. కుదరకపోవడంతో ఈ నెల 12 కోర్టు పని నిమిత్తం రమేష్ తన మామ సుధాకర్‌తో కలిసి వస్తుండగా రమేష్ వాహనాన్ని బొలోరోతో ఢీకొట్టి కిందపడగానే వేటకొడళ్లతో రమేష్ గొంతునరికి చంపారు. రమేష్‌మామ సుధాకర్‌పై దాడి చేశారు.

ఏ-1గా సంధ్యపోగు కిష్టన్న(మృతుడి తండ్రి), ఏ-2గా సంధ్యపోగు తిములమ్మ(మృతుడి తల్లి), ఏ-3గా సంధ్యపోగు గోపి (మృతుడి అన్న), ఏ-4గా సంధ్యపోగు మహేష్ (మృతుడి తమ్ముడు), ఏ-5. బోయ నర్సింహులు(లింగాపురం, గట్టు మండలం), ఏ-6గా బండమీది తిమ్మప్ప (ఇందువాసి, గట్టు మండలం), ఏ-7గా బోయ నాగేంద్ర (బోయలగూడెం, గట్టు మండలం)లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కేసు ఛేదించిన సిబ్బందికి రివార్డులు అందించారు. సమావేశంలో డీఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ టాటా బాబు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమ పూజలకు హాజరైన భక్తులు

కొత్తకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం హోమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు వామన్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మన్యెమ్మ పట్టణ ఉప సర్పంచ్ అనుసూయమ్మ మునిసిపల్ కోఆప్షన్ మాజీ సభ్యురాలు సుజాత, బాలరాజు యాదవ్, సాయులు యాదవ్ దంపతులతో పాటు పట్టణానికి చెందిన నాయకులు పలువురు హోమాలు చేశారు. విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.



దేవుని తిర్మలాపూర్‌లో హంస వాహనంపై స్వామి వారు

హంసవాహనంపై

ఊరేగిన వేంకటేశుడు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపురం గ్రామంలో ఈ నెల 4వ తేదీ నుంచి కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. ఆలయంలో నిర్వహించిన హోమంలో పెద్దకొత్తపల్లికి చెందిన అశోక్‌గౌడ్, రైస్‌మిల్లు రాజు దంపతులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ముగింపు శుక్రవారం సాయంత్రం శ్రీభూనీల సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. అంతకు ముందు స్వామి వారికి అర్చకులు ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో చక్రస్నానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్యం, గుర్రం రాజు, లక్ష్మీనారాయణ, శేఖర్, పుట్ట అంజనేయులు, అర్చకులు శేషాచార్యులు, ప్రణవచార్యులు పాల్గొన్నారు.

అడవుల ప్రాముఖ్యం తెలుసుకోవాలి

- అటవీశాఖ అధికారి సుబూర్



టూరిజం స్థలాలను పరిశీలించిన విద్యార్థులు

మన్ననూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అడవుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులు తెలుసుకోవాలని అటవీశాఖ అధికారి సుబూర్ అన్నారు. అటవీశాఖ అధికారులు శుక్రవారం నిర్వహించిన వనదర్శిని కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట, మన్ననూర్ ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఉన్న పులుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ, జీవవైవిధ్యం, ప్లాస్టిక్ ఫ్రీజోన్, బయోల్యాబ్, ఎకో టూరిజం డెవలప్‌మెంట్, జంగిల్ సఫారీ తదితర అంశాల గురించి డిజిటల్ క్లాస్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు సఫారి వాహనంలో ఫరహాబాద్, వ్యూపాయింట్, ఆక్టోపస్‌ను సందర్శించారు. వనదర్శిని ద్వారా చాలా మంచి విషయాలు తెలుకున్నా మని విద్యార్థులు, ఉపాధ్యాయులు అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు హన్మంతు నాయక్, సిబ్బంది అజయ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ

పనులపై ప్రజావేదిక

వెల్దండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి గాను మండలంలో వివిధ గ్రామాలలో ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామాలలో చేపట్టిన తనిఖీ వివరాలను ప్రజావేదికలో నివేదిక సమర్పించారు. రూ. 5.88 కోట్ల రూపాయల పనులు చేపట్టగా వాటిలో 13,989 రూపాయలు రికవరీ, 8000 రూపాయలు పెనాల్టీతో కలిపి 21, 989 రూపాయలకు నోటీసులు జారీచేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు నసిరుద్దిన్, రాజు, కృష్ణారావు, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఏపీవో ఈశ్వర్, ఎంపీవో ఉన్నారు.

ఇంటర్ బోర్డు నిర్వాకంతో

విద్యార్థుల అవస్థలు

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడి యట్ బోర్డు నిర్వాకంతో మెమోలో ఫొటోలు తప్పుగా ప్రింట్ కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ఉయ్యాలవాడ, కోడేరు జ్యోతిరావు పూలే గురుకులాల్లో 2024 సంవత్సరంలో ఇంటర్మీ డియేట్ చదివి పాసైన దాదాపు 60 మంది విద్యార్థుల మెమోలో ఫొటోలు అడ్డంగా ప్రచురితమయ్యాయి. వీరంతా మెమోలో ఫొటోలు సరిచేయడం కోసం ఇంటర్‌బోర్డులో సబ్మిట్ చేయగా బోర్డు నిర్లక్ష్యం చేస్తోందని బాధిత విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విషయాన్ని ఇంటర్ యాజమాన్యాలకు ఫిర్యాదు చేసింది. ఇంటర్ బోర్డు తక్షణమే మెమోలో ఫొటోలు సరిచేసి విద్యార్థుల అకాడమిక్‌కు ఇబ్బందులు కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'కులాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కులాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివవర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కులాంతర, మతాంతర వివాహితుల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివవర్మ మాట్లాడుతూ కులాంతర వివాహాల ప్రోత్సాహం కేవలం షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ జీవో 12 ద్వారా రూ.2 లక్షలు ఇస్తుందని, బీసీ, ఎస్టీ, మైనార్టీ శాఖలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రోత్సాహకంగా రూ.10 లక్షలు ఇవ్వాలని ఆయన కోరారు.

తెలంగాణ జాగృతి

నాయకురాలికి పరామర్శ



పావనిని పరామర్శిస్తున్న జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

కల్వకుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జాగృతి నాయకురాలు కల్వకుర్తి పట్టణానికి చెందిన మిరియాల పావని హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్నది. విషయం తెలుసుకున్న జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లు శుక్రవారం పావనిని పరామర్శించారు. మనోధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని వారు కోరారు.

ఏసీబీ దాడులతో

ఉలిక్కిపడిన గద్వాల

(5వ పేజీ తరువాయి..)

వణికిపోయారు. ఎవరు ఫిర్యాదు చేశారు.. ఎలా దొరికాడనే సమాచారం కోసం ఆరా తీశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ

గతేడాది ఇద్దరు.. నేడు మరో ఇద్దరు

జిల్లాలో గత ఏడాది ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. ఇందులో పదో బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ నర్సింమస్వామి ఓ రిటైర్డ్ ఏఆర్ ఎస్సైతో కలిసి గతేడాది జూన్ 12వ తేదీన ఇద్దరు కానిస్టేబుళ్ల పంచాయతీని పరిష్కరించి అనుకూలంగా రిపోర్ట్ ఇవ్వడానికి రూ.50వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అదే ఏడాది నవంబరు 18వ తేదీన పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావు షాదీఖాన భవన నిర్మాణం బిల్లు చెల్లించడానికి కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. డిసెంబరులో మహబూబ్‌నగర్ కమర్షిల్ కార్యాలయంలో పనిచేసే గద్వాలకు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి అనే ఏసీటీవో ఏసీబీకి పట్టుబడగా గద్వాలలో ఏసీబీ అధికారులు ఆయన ఇంటిని తనిఖీ చేసి కీలక సమాచారం తీసుకున్నారు. శుక్రవారం డీపీవో శ్యామ్ సుందర్‌తో పాటు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో పట్టుబడిన వాటిలో...

గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 16మంది అధికారులు, ఉద్యోగులు పట్టుబడ్డారు. ఈ ఏడాది డీపీవో శ్యామ్‌సుందర్ దే మొదటి కేసుగా నమోదు అయ్యింది. గత ఏడాది జరిగిన వాటిలో.. 2024 సంవత్సరం జనవరిలో అయిజ పట్టణంలో ఇంటిముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ విద్యుత్ ఉద్యోగి ఒకరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

2024 సంవత్సరం ఫిబ్రవరి నెలలో మహబూబ్‌నగర్ పురపాలిక శాఖలో ఒక ఉద్యోగి రెండు పనులకు గానూ ఎంబీలు రికార్డు చేసేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు.

2024 సంవత్సరం జనవరి నెలలో కల్వకుర్తి ఆర్‌డీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి భూమి పంచనామా చేసిన పత్రాలు రైతుకు అందించేందుకు గానూ రూ, 8 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

2024 సంవత్సరం మార్చిలో నారాయణపేట జిల్లా, గుండుమాల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగి ఒకరు రైతు వద్ద చిన్నపనికి రూ, 3,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

2024 సంవత్సరం జూన్ నెలలో వనపర్తి జిల్లాకు చెందిన విద్యుత్ అధికారుల ముగ్గురు కొత్తకోట మండలానికి చెందిన రైతువద్ద త్రీపేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.19 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు. 2024లో గద్వాలకు ఇన్‌చార్జిగా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబ్‌నగర్‌లో ఓ ఉపాధ్యాయురాలి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. 2022 సంవత్సరం జనవరిలో మరికల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి 1.07 ఎకరాల భూమిని విరాసత్ చేసేందుకు ఒక మహిళ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు.

2022 సంవత్సరం ఏప్రిల్ నెలలో కల్వకుర్తి విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అధికారి ట్రాన్స్‌ఫార్మర్ పనికోసం రూ. 1 లక్ష తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

స్పోర్ట్స్ బాక్స్

జిల్లాకు మంచి పేరు తేవాలి

» గద్వాల మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బండల పద్మావతి

» ఉత్సాహంగా సబ్ జూనియర్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న బండల పద్మావతి

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల, నైపుణ్యంతో క్రీడా పోటీల్లో రాణించి జోగుళాంబ గద్వాల జిల్లాకు మంచి పేరు తేవాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బండల పద్మావతి కోరారు. కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో సబ్ జూనియర్ కబడ్డీ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 120 మంది బాలురు, 36 మంది బాలికలు హాజరయ్యారు. ప్రాథమిక దశలో బాలుర విభాగంలో 18 మంది, బాలికల విభాగంలో 16 మందిని ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్రహాం, కార్యదర్శి నరసింహులు తెలిపారు. ఎంపికైన వారికి ఐదు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహించి 12 మంది బాలురు, 12 బాలికలతో జిల్లా జట్లను ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికైన వారు ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీవైఎస్‌వో జితేందర్, గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, మాజీ కౌన్సిలర్లు రామాంజనేయులు, రజక జయశ్రీ, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్లు బాలరాజ్‌గౌడ్, ప్రభాకర్ హాజరయ్యారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు హైమావతి, స్రవంతి, జగదీశ్, రాజేందర్ నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారిణిలను పరిచయం చేసుకుంటున్న పీఈటీ

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మినీ స్టేడియంలో 11వ జిల్లా స్థాయి యూత్ ట్రయల్ ఎంపిక పోటీలను శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రన్నింగ్, త్రోస్, జంప్ విభాగాల్లో ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నేల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. కార్యక్రమంలో రాకేశ్, అక్తర్ పాషా, గణేష్, నర్సింహులు, నరేశ్, మహేశ్, లత తదితరులు పాల్గొన్నారు.

16న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో ఈనెల 16న సబ్‌జూనియర్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. స్థానిక క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, నిర్వహణా కార్యదర్శి వెంకటప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఎంపిక పోటీలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమోలు తీసుకురావాలని సూచించారు. 16 సంవత్సరాలలోపు బాలబాలికలు పోటీలకు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

వడ్డేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్లు గ్రామానికి చెందిన భానుప్రకాష్ గౌడ్ (18) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోవిందమ్మ, వెంకట్‌రాముడుల కుమారుడు భానుప్రకాశ్ మద్యానికి బానిసై డబ్బు కోసం తరచూ తల్లితో గొడవ పడేవాడు. గురువారం ఆమె పనిమీద వేరే ఊరికి వెళ్లింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు తల్లి గోవిందమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

భార్యపై భర్త దాడి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : భార్యపై భర్త కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని గణపురం తండాలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ సురేశ్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన రాత్లావత్ రవి, జయలకు 17 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి నలుగురు సంతానం ఉన్నారు. రవి గత కొద్దిరోజులుగా భార్య జయను అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు.

దీంతో ఆమె 15 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత పెద్దల సమక్షంలో నచ్చచెప్పి ఆమెను భర్త వద్దకు పంపించారు. ఈ నెల 12న అర్ధరాత్రి భార్యభర్తలు మళ్లీ గొడ వ పడ్డారు. ఆ సమయంలో రవి, భార్య జయను కర్రతో తీవ్రంగా కొట్ట డంతో గాయపడింది. ఆమె అరుపులకు ఇరుగుపొరుగు వారు వచ్చి అడ్డు కున్నారు. ఆ తర్వాత ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికి త్స చేయించారు. సంఘటనపై బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఊట్కూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కృష్ణంరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల కేంద్రం నుంచి సమిస్తాపూర్ గ్రామానికి శుక్రవారం అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో టాస్క్ ఫోర్స్ బృందం సభ్యుడు కాళప్ప, ఎస్ఐ కృష్ణంరాజు దాడి చేసి వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 16 సంచుల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని తరలిస్తున్న సమిస్తాపూర్ గ్రామానికి చెందిన ఎస్. వినీత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. రూ. 10కి కిలో చొప్పున రేషన్ బియ్యాన్ని కొని, తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. అనంతరం బియ్యాన్ని స్వాధీనం చేసుకొని రేషన్ షాప్ డీలర్‌కు అప్పగించి, వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన సుశ్రుత అదృశ్యం అయ్యింది. ఎస్ఐ విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పెద్ద కుమార్తె సుశృత ఈ నెల 14న కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళనకు గురైన తండ్రి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంగ్లంపై పట్టు సులభంగా కలిగేట్టు..



డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

» డిజిటల్ పద్ధతిలో ఇంగ్లిష్ నేర్పించేందుకు చర్యలు

» విద్యార్థులకు భాషపై ఆసక్తి పెంచడమే ప్రధాన లక్ష్యం

» ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతి గది

» సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు సంతోష్

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆంగ్ల భాషపై సులభంగా పట్టు సాధించడమే లక్ష్యం.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దడమే ధ్యేయం.. అందుకోసం వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓ తరగతి గదిలో అత్యాధునిక ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఆంగ్ల భాషపై ఆసక్తి పెరిగేలా డిజిటల్ పద్ధతిలో విద్యా బోధన చేస్తున్నారు. తెలుగు మాధ్యమ విద్యార్థులు సైతం ఆంగ్ల భాషలో పట్టు సాధించేలా ఉపాధ్యాయుడు సంతోష్ కుమార్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఆంగ్ల భాష అక్షరమాల నేర్పించడం నుంచి వాక్య నిర్మాణం, మాట్లాడటం వరకు వారికి శిక్షణ ఇస్తున్నారు.

ఆడియో, వీడియోలతో బోధన

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు, ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంచేందుకు పాఠశాలలోని ఓ తరగతి గదిలో ప్రొజెక్టర్, పెద్ద డిజిటల్ తెరను ఏర్పాటు చేశారు. నెల వారీగా పాఠ్యాంశాల బోధనకు ప్రణాళికను రూపొందించారు. అందుకు అనుగుణంగా ఆడియో క్లిప్పులు, వీడియో చిత్రాలను డిజిటల్ తెరపై ప్రదర్శిస్తూ విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. అలాగే విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించేలా బోధనా సామగ్రి, కంప్యూటర్లను అందుబాటులో ఉంచారు. దీంతో పాటు తరగతి గది ఆకర్షణీయంగా కనిపించేలా విద్యుదీకరణ చేశారు. అందు కోసం ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ రూ. 80 వేల వరకు సొంతంగా ఖర్చు చేశారు.

చక్కని చేతి రాత సాధన

ఆంగ్ల భాషపై పట్టు సాధించడంతో పాటు, విద్యార్థుల చేతిరాతను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రతీ రోజు ఆంగ్ల అక్షరమాలను దిద్దడం, రాయడం అలవాటు చేశారు. దీంతో వారికి చక్కని చేతి రాత అబ్బింది. వారిలో కొందరు విద్యార్థులు పుస్తకాల్లోని అచ్చు అక్షరాలకు తీసిపోని విధంగా రాస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. అలాగే మండల పరిధిలో జూరాల గ్రామ పాఠశాల విద్యార్థులు సైతం చేతిరాతను మెరుగుపరుచుకుని ఇంగ్లీష్ భాషలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు.

ఆడియో, వీడియోలతో మెరుగైన బోధన



డిజిటల్ తరగతి గదిలో వీడియో, ఆడియోలు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసేందుకు ఉపయోగ పడుతున్నాయి. ఆంగ్లంతో పాటు గణితం, భౌతిక, సామాన్య శాస్త్రాల్లో అందుబాటులో ఉన్న వీడియో , ఆడియోలను ప్రదర్శిస్తూ విద్యాబోధన చేస్తున్నాం. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా వారిలోని పరిజ్ఞానానికి పదును పెట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించే విధంగా అత్యాధునిక విద్యా బోధనను అందిస్తున్నాం.

- సంతోష్ కుమార్, ఆంగ్ల ఉపాధ్యాయుడు

సులువుగా ఆంగ్ల భాష నేర్చుకున్నాను



పాఠశాలలోని డిజిటల్ తరగతి గదిలో ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ బోధనతో సులువుగా ఆంగ్ల భాషను నేర్చుకున్నాను. పాఠశాలలో చేరే నాటికి ఆంగ్లంలో అక్షరాలు రాయడం తప్పా ప్రాథమిక విషయ పరిజ్ఞానం కూడా లేకపోయింది. ప్రస్తుతం ఉపాధ్యాయుడు బోధిస్తున్న పాఠ్యాంశాలతో పాటు, ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు చూడటం ఆసక్తి కలిగిస్తోంది.

- అఖిల్, 6వ తరగతి

వినడం.. చూడటం.. చదవడం..



డిజిటల్ తరగతి గదిలో పాఠ్యాంశాలను తెరపై ప్రదర్శించడం వల్ల వినడం, చూడటం.. చదవడం పద్ధతిలో ఆంగ్ల భాషను నేర్చుకుంటున్నాను. అభ్యసన నైపుణ్యం కూడా పెరిగింది. నేర్చుకున్న అంశాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. అలాగే ఇంగ్లిష్ భాషపై ఆసక్తి కూడా పెరిగింది. ఆత్మవిశ్వాసంతో ఆంగ్లంలో మాట్లాడటం, సులువుగా చదవడం నేర్చుకున్నాను.

- శ్రీమన్నారాయణ, 9వ తరగతి

నల్లమలలో మళ్లీ కనిపించిన పెద్దపులి

» నల్లమలలోని గుండం ప్రాంతంలో సంచారం



నల్లమల అడవిలో పర్యాటకుల కంటపడిన పెద్దపులి

మన్ననూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని నల్లమల అభయారణ్య ప్రాంతంలో సఫారీ పర్యటకులకు మరో సారి పెద్దపులి కనిపించింది. శుక్రవారం సాయంత్రం పర్యాటకులు సఫారీ వాహనంలో మన్ననూరు నుంచి పర్హాబాద్ వ్యూపాయింట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా గుండం దారిలో పెద్దపులి సంచరిస్తూ కనిపించింది. దీంతో వాహనాన్ని ఆపి పర్యాటకులు సెల్‌ఫోన్లలో వీడియో తీసుకున్నారు. అది ఆడ పులి అని బయాలజిస్టు మహేందర్ ధ్రువీకరించారు. అడవిలో పెద్ద పులుల సంఖ్య పెరుగుతుండటంతో పర్యటకులకు, అటవీ శాఖ సిబ్బందికి తరుచూ కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

నాయకత్వ బలోపేతమే లక్ష్యం

» ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజు » ఉమ్మడి జిల్లా స్థాయి ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణ శిబిరం ముగింపు





సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎంపీ మల్లురవి

కొల్లాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల్లో నాయకత్వ బలపోతమే లక్ష్యంగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించినట్లు ఏఐసీసీ (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీస్ విభాగం) జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం సోమశిలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఆదివాసీ కాంగ్రెస్ మూడు రోజుల శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంత్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ విక్రమ్ బూరియ, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్యా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొప్పుల రాజు మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణతో సరిపోదని, క్షేత్ర స్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారం కృషి చేస్తూ, పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. రాష్ట్రంలో 11 శాతం ఉన్న గిరిజనులతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఒకటై పని చేయనున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో రిజర్వు స్థానాల్లో సైతం పోటీ చేసే స్థాయికి ఆదివాసీ నాయకులు ఎదగాలని ఆకాంక్షించారు. గత 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ పార్టీ ఐటీడీఏ, ట్రైకార్ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటించిన వెంటనే ఆదివాసీ నాయకులను ఎన్నికల్లో పోటీకి నిలబెట్టేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు.

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ పుట్టిందన్నారు. ఆదివాసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ సీట్లలో కూడా పోటీ చేసేలా రాజకీయ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ డైనమిక్ పార్టీ అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం ఆదివాసీ నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే కుల గణన చేసే దమ్ము, ధైర్యం ఉన్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జింకపై వీధి కుక్కల దాడి



మల్కిమియాన్‌పల్లి శివారులో గాయపడిన జింకను పరిశీలిస్తున్న అటవీశాఖ డిప్యూటీ రేంజర్ భాస్కరాచారి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : అడవిని వదిలి ఊరి సమీపంలోకి వచ్చిన జింకపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల పరిధిలోని మల్కిమియాన్‌పల్లి శివారులో, పిల్లివాగు వద్దకు శుక్రవారం ఓ జింక వచ్చింది. వీధి కుక్కలు దానిపై దాడి చేసి గాయపరిచాయి. గ్రామానికి చెందిన హసనాపురం సత్తిరెడ్డి, బుగ్గని బాలరాజు గమనించి జింకను కాపాడారు. దాని మెడపై తీవ్ర గాయమై రక్తస్రావం అవుతుండటంతో చేతిరుమాలుతో కట్టుకట్టారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అటవీశాఖ డిప్యూటీ రేంజర్ భాస్కరాచారి, బీట్ అధికారి నాగేంద్రం అక్కడికి చేరుకొని జింకను అడవిలోకి తీసుకెళ్లి వదిలేశారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీ



ఎర్రబాబు మహాదేవి (ఫైల్)

» మహిళ మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

కృష్ణ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ శివారులో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడెబల్లూరు గ్రామానికి చెందిన ఎర్ర మహాదేవి (50) తన కుమార్తెకు చెందిన కల్యాణలక్ష్మీ చెక్కును బ్యాంకులో జమ చేసేందుకు మరిది మహేశ్ అలియాస్ రమేశ్ బండారితో కలిసి ద్విచక్ర వాహనంపై కృష్ణ మండల కేంద్రానికి బయలు దేరారు. హిందూపూర్ గ్రామ శివారులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే యత్నంలో దాన్ని ఢీకొన్నారు. ప్రమాదంలో మహాదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మహేశ్ రెండు కాళ్లు విరిగాయి. సంఘటనపై అదే దారిలో వెళ్తున్న వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో ఎస్ఐ నవీద్ సిబ్బందితో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మహేశ్‌ను అంబులెన్స్‌లో కర్ణాటక రాష్ట్రం, రాయిచూరులోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మహాదేవి మృతదేహాన్ని మక్తల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంపీటీసీ మాజీ జభ్యురాలు వాకిటి లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

» మన్యంకొండ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



రెండవ కోనేరులో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మన్యంకొండలో వైభవంగా కొనసాగిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం కొండ కిందనున్న రెండవ కోనేరులో అర్చకులు స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకులు, స్వామివారికి అభిషేకం చేసి, అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి శేషవాహన సేవ నిర్వహించారు. ఆ తర్వాత గ్రామోత్సవంలో భాగంగా పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహా య కమిషనర్ శ్రీనివాసరాజు, నిత్యా నందం, నర్సింహయ్యాచార్యులు , అర్చకులు పాల్గొన్నారు.

గజవాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

» గద్వాల రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రత్యేక పూజలు



గజవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కోటలో సంస్థానాధీశుల కులదైవం భూలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఉత్సవ మూర్తులను కోట ఆలయం నుంచి శేరెల్లివీధిలోని రాఘవేంద్ర స్వామి మఠం వరకు గజవాహనంపై ఊరేగించారు. మఠం వద్ద స్వస్తి వచనం, మహా మంగళహారతి అనంతరం ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకొచ్చారు. మఠంలో స్వామివారి బృందావన ప్రతిష్ఠ జరిగి 16 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ విచారణకర్త దిన్నె ప్రభాకర్ రావు, శ్రీమఠం గద్వాల మేనేజర్ స్వామిరాయ, అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు



హుండీలోని నగదును లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, నారాయణపేటలోని ఎక్లాస్‌పూర్ బాలాజీ బ్రహ్మోత్సవాలు శుక్రవారం స్వామివారి చక్రస్నానంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకుడు మాణిక్‌శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ పుష్కరిణికి తీసుకెళ్లి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని అర్చకుడి నివాసానికి తరలించారు. అంతకు ముందు భక్తులు, ఉత్సవ నిర్వాహకులు హుండీని లెక్కించారు. రూ. 2.84 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో శ్యామ్‌సుందర్ తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, కన్న జగదీశ్, చిన్న రాంరెడ్డి, మల్లప్ప, రమాకాంత్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధిస్తాం

● ఎం.శేఖర్‌రెడ్డి, గుండుమాల్ మండల విద్యాధికారి



కోస్గి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో మండలంలో వందశాతం ఫలితాలు సాధిస్తామని గుండుమాల్ మండల విద్యాధికారి ఎం.శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

గుండుమాల్ మండల పరిధిలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?

నాలుగు ఉన్నత పాఠశాలలు, 19 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.

మధ్యాహ్న భోజనం నాణ్యతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతీరోజు కొన్ని పాఠశాలలను సందర్శించి బియ్యం, కూరగాయలను పరిశీలిస్తున్నాం. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని హెచ్‌ఎంలకు సూచిస్తున్నాం.

అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు ఉన్నాయా?

మండలంలోని అన్ని పాఠశాలలకు ఏజెన్సీలు ఉన్నాయి.

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఒక సబ్జెక్ట్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

వంద శాతం ఫలితాలు సాధించటానికి ప్రణాళికలు సిద్ధం చేశారా?

సబ్జెక్ట్ టీచర్స్ ప్రతీరోజు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నలుగురు విద్యార్థులకు ఒక టీచర్‌ను కేటాయిస్తూ వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందిస్తున్నాం. వంద శాతం ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నాం.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట (రూపాయలలో)	కనిష్ట
వేరుశనగ	479.40	6,550	4,569
పెసళ్లు	0.98	6,506	4,569
ఎర్ర కందులు	562.03	7,759	4,602
తెల్ల కందులు	66.15	7,909	5,555
గుర్రం శనిగలు	23	6,069	6,033

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కోస్గి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, మంగిమళ్ల మాజీ సర్పంచ్ సుధాకర్‌గౌడ్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ శశివర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

పొదుపు పథకంలో అవకతవకలను నిరోధించాలి

● సీపీఐఎంఎల్ మాస్‌లైన్ టౌన్ కార్యదర్శి కెంచె నారాయణ

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చేనేత పొదుపు పథకంలో అవకతవకలు జరగకుండా చూడాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ టౌన్ కార్యదర్శి కెంచె నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జియో ట్యాగింగ్ నెంబర్ ఉన్న ప్రతీ నేత కార్మికుడు ఈనెల 15లోగా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకం కింద ఇద్దరికే పరిమితం చేయకుండా గతంలో మాదిరిగా ముగ్గురికి వర్తింపజేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రతీ ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలి

మరికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవచింతనతో ఉంటే మంచి జరుగుతుందని వీరశైవ లింగాయత్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కాకుల శివకుమార్ అన్నారు. శుక్రవారం మరికల్‌లో ధర్మజాగృతి ప్రవచనం కార్యక్రమంలో భాగంగా ఉదయం వీరశైవులు గ్రామ పురవీధుల గుండా శివనామస్మరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15, 16న జరిగే ప్రవచనాలకు నేరేడుగోం పీఠాధిపతులు, స్వాములు హాజరవుతారన్నారు. ప్రవచనాలకు గ్రామస్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సైనికుల చిత్రపటాలతో విద్యార్థుల ర్యాలీ

మరికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశం మర్చిపోలేని దుర్దినం ఈరోజు అని రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ రఫీ అన్నారు. పుల్వామా దాడి ఘటనలో వీర మరణం పొందిన సైనికుల సేవలను స్మరించుకుంటూ శుక్రవారం మరికల్ మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు గ్రామ పురవీధుల గుండా సైనికుల చిత్రపటాలను పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పాఠశాలలో వీరసైనికుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త మండలం.. కొంగొత్త ఆశలు

» అభివృద్ధి పథంలో పయనిస్తోన్న గుండుమాల్
» కార్యాలయాల ఏర్పాటుతో కార్యకలాపాల విస్తరణ
» గ్రామాలను అభివృద్ధి చేసుకునే పనిలో నిమగ్నమైన నాయకులు



గుండుమాల్ మండల పరిషత్ కార్యాలయం

కోస్గి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన గుండుమాల్ మండలం ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథంలో పయనిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రం, మండల వ్యవసాయ అధికారి కేంద్రాలు కొలువై ప్రజలకు ప్రభుత్వ సేవలందిస్తున్నాయి. ఈ మధ్యనే మండల సమీకృత భవనాల ఏర్పాటుకు అధికారులు, నాయకులు భూమిపూజ చేశారు. కొత్తగా ఏర్పడిన పరిషత్ అభివృద్ధి కార్యాలయం తమ కార్యకలాపాలను కూడా కొనసాగిస్తోంది. ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు

గుండుమాల్ గ్రామం పంచాయతీ నుంచి మండల కేంద్రంగా మారడంతో మండల వాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో కొత్తగా ఎంపీటీసీ స్థానాలు ఏర్పడటంతో ఆయా గ్రామాల ప్రజలు పరిషత్ స్థానాలకు పోటీ చేసి గెలిచి తమ గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలనే ఆశతో ఉన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ ఎన్నికలతో పాటు కొత్తగా స్థానిక సంస్థలైన ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో కొత్త స్థానాలపై చర్చలు జోరందుకున్నాయి. ఇంతకుముందు సర్పంచ్ స్థానం మాత్రమే ఉండేది. ప్రస్తుతం ప్రాదేశిక సంస్థలు ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు అదనంగా వచ్చాయి. దీంతో కుదిరితే జడ్పీటీసీ లేకపోతే ఎంపీపీ, సర్పంచ్ పదవుల్లో ఏదో ఒకటి పట్టాలనే దిశగా ఆశావహులు పావులు కదుపుతున్నారు. మండలంలో ఒక జడ్పీటీసీ, ఒక ఎంపీపీ స్థానాలతో పాటు గుండుమాల్-1, గుండుమాల్-2, కొమ్మూర్, అమ్లికుంట, భోగారం, బలభద్రాయపల్లి గ్రామాలతో కలిపి మెత్తం ఆరు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ స్థానాలకు యువకులు, నాయకులు పోటీ చేయాలని ఆశ పడుతున్నారు.

ఎన్నికల నిర్వహణ కోసం అధికారుల ఏర్పాట్లు

ప్రాదేశిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి పోలింగ్ కేంద్రాలను అధికారులు ప్రకటించారు. మండలంలో గుండుమాల్-1, గుండుమాల్-2లో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 17,956 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ఇటీవల వెల్లడించిన జాబితాలో పేర్కొన్నారు. ప్రభుత్వం కుల గణన చేసే పనిలో నిమగ్నమైంది. కులగణన చేసి రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తవగానే గ్రామాల్లో సర్పంచ్, ప్రాదేశిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

సంఘాల ద్వారా మహిళలు అభివృద్ధి చెందాలి

» సెర్ప్ డైరెక్టర్ నవీన్‌కుమార్

కృష్ణ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని సెర్ప్ డైరెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురుజాల్, అలంపల్లి, కుసుమూర్తి గ్రామాల్లో సెర్ప్ బృందం పాలమూరు మహా సమాఖ్య నుంచి మహిళా సంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు రిసోర్స్ పర్సన్లు ఆయా గ్రామాల్లో సందర్శించారు. మహిళా సంఘాలు లేని మహిళలు సంఘాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రవీందర్, అడిషనల్ డీఆర్డీవో అంజయ్య, డీపీఎంలు కరుణాకర్, ఆనందం, ఇన్‌చార్జి ఏపీఎంలు బస్వరాజ్, మహేందర్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు చంద్రకళ, సీఆర్పీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాలపై విద్యార్థులకు అవగాహన

మద్దూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ స్మార్ట్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్, జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్ అయోడిన్ లోపాల వల్ల గాయిటర్, థైరాయిడ్, న్యూరో మెటర్ అనే రోగాలు వస్తాయన్నారు. వీటి నివారణకు సమతుల్య ఆహారాన్ని సరైన మోతాదులో తీసుకోవాలన్నారు. చేపలు, గుడ్లు, పాలు, మాంసం, అయోడైజ్డ్ ఉప్పు అలాగే విటమిన్ సీ నారింజ, పెరుగు, రాగులు, తదితర వాటితో పాటు పళ్లను, కూరగాయలను తినాలన్నారు. విటమిన్ లోపం వల్ల వయసుకు నిమిత్తం లేకుండా వచ్చే రోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరికల్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ రాములు

మరికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మరికల్ టాలెంట్ టెస్టు(మా) మిత్రబృందం ఆధ్వర్యంలో కే.శే మౌలాలి, కే.శే అరుణ్ జ్ఞాపకార్థం జనవరి 31న నిర్వహించిన మరికల్ టాలెంట్ టెస్టు-2025లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శుక్రవారం మరికల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్ఐ రాములు, ఇంపాక్ మోటివేషన్ స్పీకర్ సాయిబాబా, యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి హాజరై బహుమతులను అందజేశారు. టాలెంట్ టెస్టులో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దండురాములు ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు రానున్న వార్షిక పరీక్షలను ఉద్దేశించి చక్కటి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఏఎస్ఐ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నారాయణపేట వీరసావర్కార్ చౌరస్తాలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిమ్స్ ఉంచొద్దన్నారు. ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇతరత్రా వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడపవద్దని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



డాక్టర్ శిల్పకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మక్తల్ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వైద్యురాలు శిల్పకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు గోవిందరాజులు మాట్లాడుతూ కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఆలస్యం చేస్తే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, డ్రెస్‌కోడ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధు, బాల్‌రాజ్, పవన్, నరేష్, మహబూబ్, సంధ్య, లక్ష్మీ, నర్మద, తిప్పమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాద పూజ



శిశుమందిర్‌లో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, పురోహితుడు ప్రహ్లాద్ ఆచార్య, విద్వత్ పరిషత్ కన్వీనర్ లక్ష్మయ్యగౌడ్, ప్రధానాచార్యులు దత్తు చౌదరి, పోషకులు, విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారుల డైరీని కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఏడీఏ నగేష్, హైమావతి, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కుమారుడి జ్ఞాపకార్థం పాఠశాలకు మొక్కలు అందజేత



ఉపాధ్యాయులకు మొక్కలను అందిస్తున్న కాశీనాథ్

ఊట్కూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపల్లి గ్రామానికి చెందిన మడుగుల కాశీనాథ్ అనే వ్యక్తి తన కుమారుడు కార్తీక్ జ్ఞాపకార్థం వల్లంపల్లి పాఠశాలకు 20 మొక్కలను అందించారు. శుక్రవారం గ్రామంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులకు మొక్కలను అందించారు. అనంతరం వారితో మాట్లాడుతూ కుమారుడి జ్ఞాపకార్థంగా ఇచ్చిన ఈ మొక్కలను పెంచి పెద్దగా చేసి విద్యార్థులకు నీడనిచ్చేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యపాల్, శశిధర్‌రెడ్డి, ఇందిరాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

దామరగిద్ద, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొగల్‌మడ్క జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతీరోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి మిల్లెట్‌తో కూడిన స్నాక్స్ ఇస్తున్నామని ఎంఈవో కృష్ణారెడ్డి తెలిపారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆశన్‌పల్లి

దామరగిద్ద, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆశన్‌పల్లి గ్రామంలో శివస్వాములు మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములు మహాకుంభ మేళా నుంచి తీసుకొచ్చిన గంగా జలాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం అంబ భవానీ ఆలయం వద్ద మహా పడిపూజ నిర్వహించారు. పూజ అనంతరం స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, రవీందర్‌రెడ్డి, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కుంభమేళాకు తరలిన బీకేఎస్ నాయకులు

మక్తల్/కృష్ణ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న కుంభమేళాకు శుక్రవారం మక్తల్ నుంచి బీకేఎస్ నాయకులు, రైతులు తరలివెళ్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్ తెలిపారు. అదేవిధంగా కృష్ణ మండలం నుంచి దాదాపు 70 మంది కుంభమేళాకు తరలి వెళ్లారు.

ఆలయానికి గంట అందజేత

కోస్గి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గుండుమాల్ దేవల్ బాలాజీ ఆలయానికి భక్తులు గంటను అందించారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన కీ.శే.నరసింహారావు కుమారులు రాఘవ, రామకృష్ణలు రూ.17 వేల విలువ చేసే కంచు గంటను దేవల్ బాలాజీ (లక్ష్మీ వేంకటేశ్వరస్వామి) ఆలయ పూజారి అయ్యవారి శ్రావణ్‌చంద్రకు అందజేశారు.

న్యాయాధికారిపై దాడికి ఖండన

» పేట, కోస్గిలలో విధులకు దూరంగా న్యాయవాదులు



పేటలో కోర్టు నుంచి బయటికి వస్తున్న న్యాయవాదులు



కోస్గిలో కోర్టు ముందు న్యాయవాదుల నిరసన

నారాయణపేట/కోస్గి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహిళా న్యాయాధికారిపై ఓ ముద్దాయి చెప్పు విసిరి దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం నారాయణపేట, కోస్గి కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. పేటలో బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, నేడు ఏకంగా ఓ న్యాయాధికారిపైనే దాడి జరిగిందన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందునామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, న్యాయవాదులు సీతారామారావు, లక్ష్మీపతిగౌడ్, ఆకుల బాలప్ప, భీంరెడ్డి, విజయ్‌భాస్కర్, కుర్మన్నగౌడ్, కాశీశ్వర్, ప్రవీణ్‌నామాజీ, వినోద్, శ్రీకాంత్ తదితరులున్నారు. కోస్గిలో విధులు బహిష్కరించిన న్యాయవాదుల్లో శకనప్ప, సంతోష్‌నాయక్, రాజలింగం, తాజ్‌ఖాన్, రాజురెడ్డి, రమేష్, పర్వీన్ బేగం తదితరులున్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ సౌభాగ్యలక్ష్మి



వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సౌభాగ్యలక్ష్మి

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సౌభాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, క్యాన్సర్ రోగులకు సంబంధించి ప్రతీ పీహెచ్‌సీలలో ఓపీ చూసేటప్పుడు ఓరల్ క్యాన్సర్ పేషెంట్స్‌ని గుర్తించాలన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్లు ఎలా వ్యాపిస్తాయో వివరించారు. డా.సాయిరాం మాట్లాడుతూ శిశువులకు వేసే ప్రతీ టీకాల సంఖ్యను ఎంసీహెచ్, పీహెచ్‌సీల లో రిజిస్టర్‌లో రాసి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో గోవిందరాజు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఇన్‌చార్జి డెమో రాఘవేందర్, డీడీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

» ఎంఈవో కృష్ణారెడ్డి



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణారెడ్డి

దామరగిద్ద, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం సింగారం చౌరస్తాలో ఉన్న దామరగిద్ద సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ మహిళలకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు వండుతున్న బియ్యాన్ని, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సీఆర్పీ మహిపాల్ ఉన్నారు.

అమర జవాన్‌లకు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్‌ల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ శుక్రవారం వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తాలో అమరుల చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజవాన్‌ల త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. సరిహద్దుల్లో రక్షణగా ఉన్న జవాన్‌లకు దేశం మొత్తం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు భీంరెడ్డి, సత్యనారాయణగౌడ్, మల్లికార్జున్‌రావు, భీమేష్, రాహుల్, మూర్తి, రామాంజనేయులు, గోరక్ష ప్రముక్ అక్షయ్, శివ, నాగరాజు, నవీన్, అంజి, మహేష్, ఆనంద్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షబ్-ఏ-బరాత్



చిన్నపొర్లలో షబ్-ఏ-బరాత్ జాగరణ రాత్రిలో మాట్లాడుతున్న మౌలానా మొహమ్మద్ ఇర్షాద్

ఊట్కూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పెద్దపొర్ల, పులిమామిడి, బిజ్వార్, పెద్దజట్రం, నిడుగుర్తి, పగిడిమారి, కొల్లూర్ గ్రామాల్లో ముస్లింలు శుక్రవారం షబ్-ఏ-బరాత్‌ను జరుపుకున్నారు. గురువారం రాత్రి మండలంలోని చిన్నపొర్ల పంచ్ మసీద్‌లో జరిగిన షబ్-ఏ-బరాత్ జాగరణ మహోత్సవంలో మౌలానా మొహమ్మద్ ఇర్షాద్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రంజాన్ మాసానికి ముందు వచ్చే ఈ మహోన్నత రాత్రిలోనే అల్లా మనుషుల ఆయుష్షు, జనన, మరణాలు ఆదాయ వ్యయాలు, మంచి చెడులను లిఖిస్తాడని ఖురాన్ తెలుపుతున్నదని అన్నారు. అందుకే ఈ రాత్రిని భక్తిశ్రద్ధలతో గడపాలని, కన్నీళ్లు పెట్టుకుని క్షమాపణలు కోరాలని అన్నారు. జాగరణ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆలపించిన నాథేషరీఫ్, హదీసులు అందరినీ కంటతడి పెట్టించాయి. అనంతరం అర్ధరాత్రి మళ్లీ ప్రత్యేక నమాజ్ చేస్తూ జాగరణ చేశారు. కార్యక్రమంలో పంచ్ మసీద్ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.